క్లుప్తంగా

కరాటే కటాస్ విజేత శివకుమార్‌కు సన్మానం



ఖిలా వరంగల్: జనగామ జిల్లా చిల్పూరు మండలం వంగాలపల్లికి చెందిన నూనె శివకుమార్ ఇటీవల గోవాలో జరిగిన ఎఫ్ఎస్‌కేఏ వరల్డ్ చాంపియన్ షిప్ కరాటే కటాస్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం వరంగల్ శివనగర్ శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో శివకుమార్‌ను రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రశంసిస్తూ కాంస్య పతకాన్ని మెడలో వేసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంఘం వరంగల్ తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడు నూనె రవి, స్థానికులు పార్వతి రాజు, కేశాల వెంకటేశ్వర్లు, నూనె యాకయ్య, రమేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు

నేడు విద్యుత్‌కు అంతరాయం

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ శెంకేసి మల్లికార్జున్ తెలిపారు. శివనగర్, మధ్యకోట, తూర్పుకోట, పడమర కోట, స్తంభంపల్లి, హోల్‌సేల్ గ్రెయిన్ మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ చాటిన యశ్వంత్



నయీంనగర్: కరాటే ప్రపంచ కప్ పోటీల్లో హనుమకొండ నయీంనగర్‌కు చెందిన పొన్న యశ్వంత్ బంగారు పతకాన్ని సాధించాడు. ఇటీవల గోవా మపుసా వేదికగా స్పోర్ట్స్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 24వ ఎఫ్ఎస్‌కెఎఫ్ ప్రపంచ కప్ కరాటే చాంపియన్ షిప్-2024లో యశ్వంత్ తన ప్రతిభ కనబరిచాడు. ప్రపంచవ్యాప్తంగా 36 దేశాల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా యశ్వంత్ కరాటే కుముటే ఈవెంట్‌లో బంగారు పతకం, కటాస్ ఈవెంట్‌లో రజత పతకాలను సాధించి తన సత్తా చాటాడు. అండర్-14 బాలుర మైనస్ 40 వెయిట్ కేటగిరిలో ఆఫ్ఘనిస్తాన్ జట్టుతో జరిగిన ఫైనల్ రౌండ్‌లో విజయం సాధించి విజేతగా నిలిచాడు. యశ్వంత్ సాధించిన విజయాలపై తల్లిదండ్రులు పొన్న రజిత-రాకేష్ శిక్షకుడు భరత్, కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

నేడు నేషనల్ ఎస్టీ కమిషన్ సభ్యుడి రాక

కేయూ క్యాంపస్: నేషనల్ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ ఈనెల 13న కాకతీయ యూనివర్సిటీకి రానున్నారని రిజిస్ట్రార్ మల్లారెడ్డి తెలిపారు. కేయూ సేనేట్‌హాల్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎస్టీ అసోసియేషన్స్, గిరిజన ఎంప్లాయిస్‌తోను సమావేశంను నిర్వహించనున్నామని మల్లారెడ్డి ఒక సర్క్యులర్ జారీచేశారు.
గిరిజన విద్యార్థుల, అధ్యాపకుల సమస్యలపై హుస్సేన్‌నాయక్‌కు వినతిపత్రాలు సమర్పించాలని కేయూ గిరిజన విద్యార్థి సంఘం నేత వెంకట్‌నాయక్ కోరారు. మంగళవారం కేయూలో నిర్వహించిన గిరిజన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో గిరిజన విద్యార్థి సంఘం బాధ్యులు వెంకట్ దేవేందర్‌నాయక్, రమేష్‌నాయక్, సుమన్, సతీష్, రఘు, అశోక్, పాల్గొన్నారు.

జాతీయ సింపోజియం బ్రోచర్ ఆవిష్కరణ



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 27న యాస్పిరేషన్స్ ప్రామిసెస్ అండ్ పొలిటికల్ పర్‌ఫార్మెన్సెస్ ఆఫ్ తెలంగాణ స్టేట్ అంశంపై జాతీయ సింపోజియంను నిర్వహించనున్నట్లు ఆ విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ తెలిపారు. మంగళవారం దీనికి సంబంధించిన బ్రోచర్‌ను క్యాంపస్‌లోని అకడమిక్ కమిటీహాల్‌లో వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ మల్లారెడ్డి, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ రాంచంద్రం, బీఓఎస్ చైర్మన్ డాక్టర్ కృష్ణయ్య, పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

ఖిలా వరంగల్: నగరంలోని రంగశాయిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం అధికారుల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన సాధారణ జీవిత బీమాపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

లైంగికదాడుల నివారణకు కృషి చేయాలి

● సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్

హన్మకొండ: బాలలపై జరుగుతున్న లైంగిక దాడులు, ఆన్‌లైన్ లైంగిక వేధింపుల నివారణకు ప్రభుత్వంతో కలిసి స్వచ్ఛంద సంస్థలు నివారించడానికి కృషి చేయాలని సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని అసుంతభవన్‌లో ఎఫ్ఎంఎం సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకు బాలలు, మహిళలపై లైంగిక దాడులు పెచ్చుమీరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి జయంతి మాట్లాడుతూ పుట్టిన నాటి నుంచి వృద్ధుల వరకు తమ శాఖ అన్ని సందర్భాల్లో సేవలు అందిస్తుందన్నారు. ఎలాంటి ఆధారంలేని వారికి అండగా నిలుస్తుందన్నారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పాఠశాల, కళాశాలలో క్షేత్రస్థాయిలో విద్యార్థులకు, సమాజానికి అట్టడుగున వెళ్లి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎఫ్ఎంఎం సాంఘీక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ మాట్లాడుతూ మహిళల ఆర్థిక చైతన్యం కోసం, బాలల లైంగిక దాడుల నివారణ, మానవ అక్రమ రవాణ నివారణకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వరంగల్ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ, మహబూబాద్ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, మాజీ సీడబ్ల్యూసీ చైర్మన్ మండల పరుశరాములు,అనితారెడ్డి, డీసీపీఓలు ప్రవీణ్, రాజు, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఎర్ర శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్

మార్కెట్‌లో రైతులకు స్థలం కేటాయించాలి

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని కూరగాయల మార్కెట్‌లో రైతులు పండించిన కూరగాయలను అమ్ముకునేందుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించాలని రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ మంత్రి కొండా సురేఖను కోరారు. మంగళవారం మార్కెట్ సందర్శనకు వచ్చిన మంత్రి సురేఖకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కూరగాయల పంటలను అమ్ముకోవడానికి జిల్లా వ్యాప్తంగా రైతులు రాత్రి 12 గంటలకు ట్రాలీ ఆటోల్లో మార్కెట్‌కు ప్రతి రోజు సుమారుగా 200 మంది రైతులు వస్తుంటారని తెలిపారు. వీరు పంటను అమ్ముకోవడానికి రోడ్డు పైనే పెట్టి పెట్టడం వల్ల రైతులు వానకు నానుతు, చలికి వణుకుతూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులు ఇక్కడ అమ్మడం వల్ల కొంతమంది వ్యాపారస్తుల గుమస్తాలు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి రవీందర్, రాజు, మహేందర్ పాల్గొన్నారు.



మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

గణేశ్‌నగర్‌లో తాగునీటి కొరత

ఖిలా వరంగల్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 43వ డివిజన్ గణేశ్‌నగర్ కాలనీలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని వీధుల్లో రోజు విడిచి రోజు బిందెడు నీళ్లు వస్తే మరికొన్ని వీధుల్లో వారం రోజులైనా చుక్క నీరు రావటం లేదని స్థానిక మహిళలు వాపోతున్నారు. తాగునీటి సమస్యలపై ఏఈ స్థాయి అధికారికి కాల్ చేసినా స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు. కాలనీకి చివరగా ఉన్న వాటర్ ప్లాంట్లకు వెళ్లి రూ.20లు పెట్టి క్యాన్ కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి గణేశ్‌నగర్‌లో తాగునీటి సరఫరా చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

సీసీ కెమెరా.. మూడో కన్నులాంటిది

● సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా

హసన్‌పర్తి: సీసీ కెమెరా.. మూడో కన్ను లాంటిదని సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా అన్నారు. కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్‌సింగ్ నగర్ కాలనీలో మంగళవారం రాత్రి కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. తొలుత కాలనీలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అపరిచిత వ్యక్తులు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రూ.2వేలు విలువైన నిషేధ గుట్కాలను సీజ్ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో డీసీపీ సలీమా మాట్లాడుతూ కాలనీ వాసులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. యువత డ్రగ్స్, గంజాయికు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయితో పట్టుపడితే నేరుగా జైలుకు పంపుతామని హెచ్చరించారు. కాలనీల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ రవికుమార్, ఎస్సై రవీందర్ , సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా

సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి

మామునూరు: అధిక సాంద్రతతో పత్తి సాగు చేయడం వల్ల గులాబీ రంగు పురుగు ఉధృతి నుంచి పంటను కాపాడుకోవచ్చని, దీని నివారణకు రైతులు సమగ్ర సస్య రక్షణ పద్ధతులు పాటించాలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న రాజన్న అన్నారు. మంగళవారం పీ వీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విద్యాలయం పరిధిలో మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ పత్తి పరిశోధన స్థానం నాగపూర్ సంయుక్త ఆధ్వర్యంలో ఖిలావరంగల్ మండలం, ఐనవోలు మండలాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యటించారు. ఈ సందర్భంగా అధిక సాంద్రత గల ప త్తి పంటలను పరిశీలించారు. హన్మకొండ, వరంగల్ జిల్లాలో 548 ఎకరాలల్లో సాగు చేస్తున్నారని తెలిపారు. తర్వాత రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు అందజేశారు. శాస్త్రవేత్తలు సీహెచ్ సౌమ్య, డాక్టర్ రాజు, రాశి విత్తన సంస్థ రీజినల్ బిజినెస్ మేనేజర్ ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.



పత్తిపంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త రాజన్న

సంక్షిప్త సమాచారం

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

రామన్నపేట : కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ హాస్పిటల్‌లో పీజీ డాక్టర్ విద్యార్థినిపై అత్యంత అమానవీయంగా సామూహిక అత్యాచారం, హత్యకు పాల్పడిన ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి రత్నమాల కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఐద్వా రామన్నపేట ఏరియా కమిటీ అధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షులు రంగరాజు విజయ అధ్యక్షతన మానవహారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రత్నమాల మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు మహిళలకు రక్షణ కరువైందన్నారు. పట్టపగలే మహిళలు రోడ్ల పై స్వేచ్ఛగా నడిచే పరిస్థితి లేదన్నారు. వెంటనే పూర్తిస్థాయి న్యాయ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పూర్వ కమిటీనే కొనసాగించాలి



కాశిబుగ్గ : గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్ కాశిబుగ్గలోని చారిత్రక కాశీ విశ్వేశ్వరాలయం పూర్వ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులనే ఆలయ కమిటీ సభ్యులుగా కొనసాగించాలని కోరారు. మంగళవారం ఓ సిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి కొండా సురేఖను పాత ఆలయ కమిటీ సభ్యులు కలిశారు. ఈనెల 16న ఆలయంలో జరిగే లక్ష దీపోత్సవం, జ్వాలతోరణం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని మంత్రిని ఆహ్వానించారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ భాస్కర్, పాత ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

సఖీ సెంటర్లలో బాలికలు, మహిళలకు రక్షణ

వరంగల్: నగరంలోని బాలికలు, మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సఖీ సెంటర్‌ను సంప్రదిస్తే సహాయం అందిస్తామని వరంగల్ సఖీ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శోభారాణి అన్నారు. మంగళవారం వరంగల్ సఖి సెంటర్ సేవలు, బాలికల హక్కులు, చట్టాలపై సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ సహకారంతో అవగాహన కార్యక్రమం ఎల్‌బీ నగర్‌లోని మాసూమ్ అలీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత మహిళలకు, పిల్లలకు అందించే సేవలు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాలేని మహిళలు మహిళా హెల్ప్ లైన్ 181 కి కాల్ చేసినట్లయితే వెంటనే రెస్క్యూ చేస్తామన్నారు. అసభ్యకరమైన హింసలకు ఏమైనా గురైనట్లయితే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి ఫోన్‌చేసి సమస్యను తెలుపాలన్నారు.

పేదలకు పక్కా గృహాలు నిర్మించాలి



ఖిలా వరంగల్: గుడిసెవాసులకు ప్రభుత్వం పట్టాలిచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. మంగళవారం శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో మహ్మద్ యాకూబ్ అధ్యక్షతన జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేళ్ల సీపీఐ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఘనంగా పల్లె పల్లెనా వాడవాడల్లో ఎర్రజెండాలు రెపరెపలాడేలా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. త్వరలోనే మామునూరు ఎయిర్ పోర్ట్‌ను ప్రారంభించాలని దీంతో జిల్లా భారీ పరిశ్రమలు రావడం జరుగుతుందని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు.

సమస్యలపై వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తుకు అవకాశం

కాజీపేట: సీనియర్ సిటిజన్లు తమ మెయింటెనెన్స్ సమస్యలను వెబ్ పోర్టల్‌లో నేరుగా దరఖాస్తు చేసుకుని పరిష్కారం పొందవచ్చు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పిల్లలు పట్టించుకోకపోయినా..వారిని నిర్లక్ష్యం చేయడం, తమ ఆస్తి తీసుకుని ఇబ్బందులకు గురి చేయడం లాంటి వాటితో పాటు మెయింటెనెన్స్ ఇవ్వకపోవడం లాంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం 2007లో సీనియర్ సిటిజన్ యాక్ట్‌ను తీసుకొచ్చిందన్నారు. తహసీల్దార్, ఆర్డీఓ స్థాయి అధికారులు వారి పిల్లలకు నోటీసులు ఇవ్వడంతో పాటు అవసరమైన పరిహారం ఇచ్చేలా బాధితులకు సరైన న్యాయం జరిపించేలా ఆర్డీఓ చర్యలు తీసుకుంటారు. సమస్యలకు సంబంధించిన కేసుల నమోదుకు ***tgseniorcitizens.cgg.gov.in*** ద్వారా దరఖాస్తు చేసుకోవాలని రెవెన్యూ అధికారులు సూచిస్తున్నారు.

లైఫ్ సర్టిఫికెట్ నమోదు కేంద్రం ప్రారంభం

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం జీవన్ ప్రమాణ్ లైఫ్ సర్టిఫికెట్ నమోదు కేంద్రాన్ని కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ ప్రారంభించారు. రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సంగమయ్య ఆధ్వర్యంలో వృద్ధుల కోసం లైఫ్ సర్టిఫికెట్ ప్రత్యేక నమోదె కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ



హసన్‌పర్తి: తహసీకార్యాలయాన్ని హనుమకొండ ఆర్డీఓ రమేష్ రాథోడ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. రోజు వారీగా వచ్చే రిజిస్ట్రేషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ చల్లా ప్రసాద్, డీటీ రహీం, ఆర్ఐ రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

పేదలకు అన్నం ప్యాకెట్ల పంపిణీ

కాజీపేట: పట్టణంలో మంగళవారం రాత్రి జీసస్ ప్రేయర్ హాల్ అసోసియేసన్ సభ్యులు పేదలకు అన్నం ప్యాకెట్లను పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు ఎ.మరియదాస్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు పుర వీధుల్లో సంచరిస్తూ భోజనం ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి బ్రదర్ క్రిష్టఫర్, బ్రదర్ సూరయ్య, ఉపేందర్, నవీన్‌రెడ్డి, మనోహర్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

రాజిరెడ్డి మృతితో సోమిడిలో విషాదఛాయలు

కాజీపేట: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందడంతో మండలంలోని సోమిడి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సోమిడికి చెందిన ట్రావెల్స్ యజమాని మూల రాజిరెడ్డి సమీప బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు హాజరై తిరిగి వస్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పి ఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మృతుడి నేత్రాల సేకరణ

భార్య, పిల్లల అభిలాష మేరకు తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా సభ్యులు మృతుడి నేత్రాలను సేకరించారు. వరంగల్ నేత్ర సేకరణ టెక్నీషియన్ నరేందర్ నేత్ర కార్నియా స్వీకరించి ఇద్దరు అంధులకు చూపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి మూల ప్రతాప్‌రెడ్డి, మూల అనిల్, చిరంజీవి, రాజమౌళి, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల అమలుకు కృషి చేయాలి



హన్మకొండ: కుల గణనలో బీసీల రాజకీయ వెనుకబాటు తనాన్ని గుర్తించడంతో పాటు, 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కృషి చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్‌రావును బీసీ సంఘాల నాయకులు కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల ప్రయోజనాలు కాపాడాలన్నారు. ఈ రిజర్వేషన్ల అమలులో న్యాయ ప్రక్రియ, రాజ్యాంగ సవరణ కీలకమైన అంశాలని, ఈ క్రమంలో ప్రభుత్వం అవసరమైన జాగ్రత్తలు తీసుకుని 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా చూడాలన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

వరంగల్ అర్బన్ : నగరంలో సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వే మంగళవారం ఊపందుకుంది. సర్వేలో ఆశించిన మేరకు పురోగతి కనిపించకపోవడంతో కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే సీరియస్ కావడంతో ఎన్యుమరేటర్లు కొంత సీరియస్‌గా దృష్టి సారించారు. నాలుగు రోజుల వ్యవధిలో కాశిబుగ్గ సర్కిల్ పరిధిలో 21,964, కాజీపేట సర్కిల్‌లో 15,138 కుటుంబాల నుంచి వివరాలను సేకరించి నమోదు చేశారు. బల్దియా అధికారులు, సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తూ సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

ఇంటివద్ద నుంచే లైఫ్ సర్టిఫికెట్

కాజీపేట అర్బన్ : ప్రతి ఏడాది నవంబర్ లో రైల్వే పెన్షనర్లు తప్పకుండా సంబంధిత బ్యాంకుల్లో లైఫ్ సర్టిఫికెట్‌ను అందజేయాల్సి ఉంటుంది. సర్టిఫికెట్‌ను సకాలంలో అందజేయకపోతే తదుపరి నెల పెన్షన్ నిలిచిపోతుంది. లైఫ్ సర్టిఫికెట్ బ్యాంకుల్లో అందజేయడం ఎంతో కష్టంగా మారిపోయిన తరుణంలో ఇంటి నుంచే సర్టిఫికెను అందజేసేందుకు పెన్షనర్లు మారపాక కట్ట స్వామి, సాధినేని సూర్యనారాయణలు జీవన్ ప్రమాణ్ యాప్‌లో పెన్షనర్ల వివరాలను సేకరించి లైఫ్ సర్టిఫికెట్‌ను బ్యాంకులకు ఆన్‌లైన్‌లో చేరవేస్తూ ఔదార్యం చాటుకుంటున్నారు. కాజీపేట మండలం కడిపికొండలో మంగళవారం పెన్షనర్ల ఇంటి వద్ద నుంచే లైఫ్ సర్టిఫికెట్‌ను అందజేయడంతో పెన్షనర్లు కృతజ్ఞతలు తెలియజేసారు.

రామకోటి స్తూపానికి ప్రత్యేక అర్చనలు

మడికొండ: మెట్టుగుట్టపై ఉన్న రామకోటి స్తూపానికి ఏకాదశి సందర్భంగా మంగళవారం ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రామకోటి రాసిన పుస్తకాలను అందులో నిక్షిప్తం చేశారు. ప్రతీ ఏకాదశి రోజున నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి కే. శేషుభారతి తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు శివాలయం చైర్మన్ రఘుచందర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

దీపాలకాంతుల్లో సంతాన లింగేశ్వరుడు



కాజీపేట: 62వ డివిజన్ విష్ణుపురి కాలనీలో కొలువుదీరిన స్వయంభు శ్వేతార్కమూలగణపతి దివ్యక్షేత్రంలో కార్తీక మాసోత్సవాల్లో వేడుకలను పురస్కరించుకుని మంగళవారం సంతాన లింగేశ్వరస్వామికి దీపాలంకరణ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తులసీపూజ, ఈశ్వరాభిషేకం, సహస్ర బిల్వదళపూజలను జరిపించారు. దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ పర్యవేక్షణలో భక్తులు సంతానలింగేశ్వరుడి చుట్టూ దీపాలను వెలిగించి దీపారాధన పూజ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని అడ్డుకున్న సిబ్బంది

మడికొండ : గ్రేటర్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండ ఎస్సీ, బీసీ కాలనీలో 1983లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టగా కాలనీలో పార్క్ స్థలానికి కేటాయించిన స్థలంలో అక్కడ ఉన్న స్థానికులు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నట్లు సమాచారం అందుకున్న మున్సిపల్ అధికారులు అక్కడికి వెళ్లి విచారణ చేపట్టారు. దానికి సంబంధించిన పత్రాలను తీసుకొని కార్యాలయంలో సంప్రదించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో అధికారులకు స్థానికులకు మధ్య వాగ్వాదం జరిగింది. మున్సిపల్ అధికారులు ఏసీపీ రజిత, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆర్థికసాయం

మామునూరు: మౌలానా అబుల్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని వరంగల్ జవహర్ నవోదయ విద్యాలయంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పేద దివ్యాంగ విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశారు. ముఖ్యఅతిథులుగా రాజేంద్రప్రసాద్, సమ్మయ్య హాజరై ప్రిన్సిపాల్ పూర్ణిమతో కలిసి విద్యార్థులకు ఆర్థికసాయం అందజేసి అభినందించారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి

విద్యారణ్యపురి: బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలని ఏబీఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్ఏ స్టాలిన్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను సందర్శించాలని విద్యార్థుల ఆత్మహత్యలకు కారణాలేమిటో తెలుసుకొని అక్కడ నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని కో రారు. గత రెండేళ్లలో ట్రిపుల్ ఐటీలో 9 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరమన్నారు. ఈనెల 11న ట్రిపుల్ ఐటీలో సెకండియర్ చదువుతున్న స్వాతిప్రియ ఆత్మహత్య చేసుకున్న సంఘటను కుటుంబ సభ్యులు వచ్చేవరకే ఆస్పత్రికి తరలించారని ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. వెంటనే ఆత్మహత్యలపై విచారణ జరిపించాలని స్టాలిన్ డిమాండ్ చేశారు.

టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

కాజీపేట: 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని నారాయణ కళాశాలలో మంగళవారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. టెస్ట్‌కు నారాయణ విద్యార్థులే కాకుండా ఉమ్మడి జిల్లాలోని అనేక కళాశాలలకు చెందిన విద్యార్థులు భాగస్వామ్యం పంచుకున్నారు. కార్యక్రమంలో కోర్ డీన్ సీహెచ్. రఘుపతిరెడ్డి, ఏజీఎం నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి, అనిల్ గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జాతిపితకు వందనం

కాజీపేట అర్బన్ : జాతిపిత మహాత్మాగాంధీజికి తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్ మంగళవారం నివాళులర్పించి వందనం చేశారు. జపాన్ దేశ పర్యటనలో భాగంగా టోక్యోలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పర్యటనలో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌లు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మామునూరు: వివిధ గ్రామాల్లో సేకరించి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం వరంగల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. మార్కండేయనగర్‌కు చెందిన అనకట్ల నవీన్ ఇంట్లో అక్రమంగా రేషన్‌బియ్యం నిల్వలు ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్‌కు పక్కా సమాచారం అందింది. ఏసీపీ ఆదేశాల మేరకు మంగళవారం మధ్యాహ్నం కాలనీలో నవీన్ ఇంటిపై సిబ్బందితో కలిసి టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్ ఆకస్మికంగా దాడి చేశారు. దాడిలో అక్రమ నిల్వ చేసిన రూ.13వేల విలువైన 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం, టాటా ఏస్ వాహనం సీజ్ చేసి తదుపరి చర్యల నిమిత్తం కేసును మామునూరు పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాల పరిచయ కార్యక్రమం



హన్మకొండ కల్చరల్ : కార్తీకమాసం, కార్తీకపౌర్ణమిలను పు రస్కరించుకుని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక వరంగల్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఫోర్ట్‌రోడ్ కృష్ణ కాలనీ ఏరియాలో ఆధ్యాత్మిక గ్రంథాల పరిచయ, ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జ్ఞానవేదిక వరంగల్ కమిటీ అధ్యక్షుడు ఓంప్రకాష్ ఆచారి, సుధీర్, ధన్వంతరి, సుధాకర్, వాసంతి, విజయలలిత, సుష్మస్వరూప, లేఖ, విమల, వెన్నెల, అంజమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామన్నపేట : పాత పెన్షన్ సాధనే ధ్యేయంగా ఉపాధ్యాయ, అధ్యాపక, ఆచార్యాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ సీపీఎస్ అభ్యర్థి డాక్టర్ కొలిపాక వెంకటస్వామి అన్నారు. మంగళవారం ఆయన నగరంలోని కేఎంసీ, ప్రతిమ రిలీఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఫాదర్ కొలంబో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, హై స్కూల్స్, ఇతర పాఠశాలలను సందర్శించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నప్పరెడ్డి, మహేందర్‌రెడ్డి, సురేందర్, కాత్యాయిని, నాజియా, తరుణ్‌రెడ్డి, శరీర, అవయవదాన ప్రచారకులు కోన్‌రెడ్డి మల్లారెడ్డి, సీపీఎస్ సంఘ బాధ్యులు శ్రీనివాస్, షేక్ అఫ్జల్, ఉపాధ్యాయులు, లెక్చరెర్లు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఆటో అడ్డాలను పరిశీలించిన ట్రాఫిక్ సిబ్బంది

కాజీపేట: పట్టణంలో మంగళవారం ట్రాఫిక్ పోలీసులు ఆటోల లోకల్ అడ్డాలను పరిశీలించారు. మడికొండ, రాంపురం, ధర్మసాగర్ గ్రామాలకు చెందిన ఆటోడ్రైవర్ల సౌలభ్యం కోసం సీఐ నాగబాబు ఆదేశం మేరకు ఆటోలఅడ్డాను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిబ్బంది ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. తాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, రాష్ట్రముఖ్య సలహాదారు కృష్ణమూర్తి, వస్కుల రాజు, సదానందం, సలీం, కిరణ్ పాల్గొన్నారు.

దూరవిద్య పీజీ పరీక్షల్లో ఇద్దరు డీబార్

కేయూ క్యాంపస్ : కేయూ పరిధిలోని దూరవిద్యా కేంద్రం పీజీ కోర్సుల పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన పీజీ ఫైనలియర్ పరీక్షల్లో వరంగల్‌లోని ఎల్‌బీ కళాశాల పరీక్షా కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు కాపీయింగ్ చేస్తుండగా స్క్వాడ్ పట్టుకొని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్యులు ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు.

ఉజ్వల భారత దార్శనికుడు అబుల్ కలాం

న్యూశాయంపేట : ఉజ్వల భారత దార్శనికుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని వరంగల్ ఇస్లామియా కళాశాల మాజీ ప్రిన్సిపాల్ బహదూర్ అలీ అన్నారు. మంగళవారం వరంగల్ ఎల్‌బినగర్ గోల్డెన్ గెస్ట్‌హౌజ్ ఉర్దూ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యాదినోత్సవం-మైనారిటీ వెల్ఫేర్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహ్మద్ ఖాదర్‌మోహియొద్దీన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కలాం విద్యాగని, సలక్షణ శోభితుడన్నారు. మహాకవి, రచయితగా ప్రశంసలందుకున్నాడన్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఎల్‌బీనగర్‌లోని మసూంఅలీ ఉన్నత పాఠశాలకు చెందిన మహ్మద్ సమీర్ అండర్-14 క్రికెట్ వరంగల్ ఉమ్మడి జిల్లా జట్టుకి ప్రాతినిధ్యం వహిస్తూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా సమీర్‌ను అతిథుల చేతులమీదుగా జ్ఞాపికను అందచేసి సత్కరించారు. కార్యక్రమంలో ఇస్లామియా కళాశాల ప్రిన్సిపాల్ మీర్ కౌకబ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.